క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ములుగు రూరల్ : విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ములుగు విద్యుత్ శాఖ ఏఈ భూక్యా రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్‌ల మరమ్మతుల్లో భాగంగా నేడు (బుధవారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ములుగులోని బీడీ కార్మికుల కాలనీ, కృష్ణాకాలనీ, బండారుపల్లి, జీవింతరావుపల్లి, మాధవరావుపల్లి, గణేష్‌పల్లి, మదనపల్లి గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇరాన్‌పై దాడి అమానుషం



ములుగు రూరల్ : ఇరాన్‌పై అమెరికా దాడి చేయడం అమానుషం అని, దాడిని ఖండిస్తు మంగళవారం జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివరెడ్డి మాట్లాడుతూ అమెరికా అంతర్జాతీయ చట్టాలను ఐక్యరాజ్య సమితి నిబంధనలను తుంగలో తొక్కందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుమ్మల వెంకటరెడ్డి, రాజేందర్, దామోదర్, రత్నం ప్రవీణ్, చంటి, కోటయ్య తదితరులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

మంగపేట : మండలంలోని బోరునర్సాపురం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి గోదావరి ఫెర్రీ పాయింట్ వరకు రోడ్డు నిర్మాణానికి ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగం డీఈ ప్రశాంత్‌రెడ్డి, ఏఈ రాము ఆధ్వర్యంలో మంగళవారం సర్వే నిర్వహించారు.గోదావరి ఫెర్రీ పాయింట్ వరకు 2.5 కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరైనట్లు వారు తెలిపారు.

రోడ్డు పనుల పరిశీలన



వాజేడు : మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో జరుగుతున్న సర్వీస్ రోడ్డు పనులను నేషనల్ హైవే డీఈ కుమార స్వామి మంగళవారం పరిశీలించారు. జగన్నాథపురం నుంచి చెరుకూరు వరకు 10 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

విత్తన షాపుల తనిఖీ



కన్నాయిగూడెం : మండల పరిధిలోని ముప్పనపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లోని ఎరువులు, విత్తన దుకాణాలను మండల వ్యవసాయాధికారి ముంజ మహేష్ మంగళవారం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా మిర్చి, వరి వంగడాలతో పాటు ఇన్వాయిస్‌లను పరిశీలించారు. విత్తన నమూనాలను సేకరించి నాణ్యత ప్రమాణాల కోసం హైదరాబాద్‌కు పంపించినట్లు ఏఓ తెలిపారు.

'అమ్మ పేరుతో మొక్క నాటాలి'



భూపాలపల్లి రూరల్ : అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని బీజేపీ జిల్లా నాయకుడు దొంగల రాజేందర్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు బూర పద్మ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మ పేరు మీద ఉచితంగా మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేందర్, మహిళా నాయకురాలు వేశాల సత్యవతి హాజరై ప్రజలకు మొక్కలు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో మొక్కలు నాటాలని సూచించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ 11సంవత్సరాల పరిపాలనలో భాగంగా దేశమంతా అమ్మ పేరుతో మొక్కలు నాటాలని భారతీయ జనతా పార్టీ ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని అందులో భాగంగానే మొక్కలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. నాయకులు ఊరటి మునీందర్, బూర రమేష్, హైమావతి, శ్రీదేవి, దూలం మొండయ్య, సుమలత, శంకర్, ఆవుల సంతోష్, నాంపల్లి కుమార్, ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే!

● గుంతల్లో నిలుస్తున్న వర్షపునీరు
● పట్టించుకోని అధికారులు, పాలకులు



చిత్తడిగా మారిన పోలీస్ స్టేషన్ ఎదుట గల ప్రధాన రహదారి

మంగపేట : ఏజెన్సీ ప్రాంతంలోని రహదారులు చినుకుకే చిత్తడిగా మారుతున్నాయి.. భారీ గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో ప్రయాణికులు, బాటసారులు ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలోని గంపోనిగూడెం నుంచి వైజంక్షన్ వరకు ప్రధాన రహదారిని ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదనే మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా..రోడ్ల అభివృద్ధి జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం సీజన్ మొదలైన నేపథ్యంలో కొద్దిపాటి వర్షానికే ప్రధాన సీసీరోడ్డుపై వర్షపు నీరు నిలిచి మురికి కూపంగా మారుతోంది.

చెరువును తలపిస్తున్న రోడ్లు

వర్షం పడిందంటే చాలు మండల కేంద్రంలోని గంపోనిగూడెం తెలంగాణ అమరవీరుల స్తూపం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఉన్న సీసీ రోడ్డు, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం ఎదుట, పోలీస్ స్టేషన్ ఎదుట, వైజంక్షన్ సెంటర్‌లో ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తున్నాయి. ప్రధానంగా సీసీ రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించక పోవడంతో 20 ఏళ్లక్రితం నుంచి ఇదే పరిస్థితి నెలకొందని అంటున్నారు. 2020లో పంచాయతీ అభివృద్ధి నిధులతో వైఎస్సార్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఒకవైపు డ్రెయినేజీ నిర్మించి మరోవైపు నిర్మించక పోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే అవకాశ లేక రోడ్డుపై నిలిచి ఉంటున్నాయి. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాల్సిన పంచాయతీ అధికారులు గుంతల్లో ఎర్రమొరం పోసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో మండల కేంద్రానికి వందల సంఖ్యలో వచ్చి వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలు అక్కడినుంచే రాకపోకలు సాగిస్తున్నాయి.

బురదగా మారుతున్న రహదారులు

స్థానిక రోడ్డు వర్షపు నీటితో బురదగా మారి అందులో నుంచి నడిచి వెళ్లే అవకాశం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై నిలిచిన బురద నుంచి వాహనాలు వెళ్తుడడంతో కాలినడకన వెళ్లే వారిపై బురదనీరు మీద పడుతోంది. పోలీస్ స్టేషన్ నుంచి వైఎస్సార్ సెంటర్ వరకు చికెన్, మటన్ షాపులు, చేపల విక్రయాల ద్వారా భరించ లేని దుర్వాసన వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలో నెలకొన్న సమస్యను శాశ్వతంగా పరిష్కరించే విషయంలో పాలకులు పట్టించుకోక పోవడం, గ్రామ, మండల స్థాయి అధికారులు సైతం తమకేమీ సంబంధం లేదనే విధంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిల్వకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



ములుగు రూరల్: పెగడపల్లిలో నిల్వనీటిని పారబోస్తున్న సిబ్బంది



వెంకటాపురం(కె): వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు, సిబ్బంది

● డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విపిన్‌కుమార్

ములుగు రూరల్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విపిన్‌కుమార్ అన్నారు. ఈమేరకు మంగళవారం రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పెగడపల్లిలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఇంటింటి ఫీవర్ సర్వేను, యాంటి లార్వా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విపిన్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజలు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. నీటి నిల్వల ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ వేసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సంపత్‌రావు, నందకిషోర్, ఆరోగ్య కార్యకర్తలు సులోచన, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్యపరీక్షలు

వెంకటాపురం(కె) : మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో మంగళవారం మహిళలకు వైద్యాధికారి స్నేహ రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. 74 మంది మహిళకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 16 మంది నుంచి రక్తన మూనాలను సేకరించి పరీక్షల కోసం ములుగు ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా మండల పరిధిలోని ఉప్పేడు, వీరాపురం, రామచంద్రాపురం, శివాపురం గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించి మందులు అందజేశారు. వైద్యాధికారులు వినయ్, పవన్, మనోహర్ తదితరులు ఉన్నారు.

అబ్బాయిగూడెంలో..

మంగపేట : స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని అబ్బాయిగూడెంలో తిమ్మంపేట పల్లె దవాఖానా వైద్యాధికారి మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 48 మందికి సాధారణ వైద్యపరీక్షలు, 8 మందికి బీపీ, నలుగురికి షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 9 మందికి రక్త పరీక్షలు చేశారు. గ్రామంలో డెంగీ, మలేరియా జ్వరాలు లేకపోవడంతో వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ముత్తమ్మ, ఏఎన్ఎం మమత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

'ఆదర్శ' హాస్టల్ తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న రవిచందర్

ములుగు రూరల్ : మోడల్ కళాశాల విద్యార్థినులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. మంగళవారం బండారుపల్లి మోడల్ కళాశాల వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. వసతులపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, వంశీకృష్ణ, దేవ్‌సింగ్, రాకేష్ ఉన్నారు.

విలేకరిపై దాడి

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన ఓ దినపత్రిక విలేకరి చల్లగొండ శ్రీకాంత్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం దాడి చేశారు. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం. నార్లాపూర్ గ్రామానికి చెందిన విలేకరి శ్రీకాంత్‌రెడ్డి వార్తల సేకరణ కోసం తాడ్వాయికి వచ్చి తిరిగి వెళ్తుండగా సారలమ్మ గుడి దాటిన తర్వాత బైక్ ఆపి ఫోన్ మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో నార్లాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తండాల శ్రీనివాస్, మొక్క శ్రీనివాస్, బొప్ప వినోద్, సంకే శ్రావణ్, ఎనగంటి సాయికృష్ణలు వెనకల కారులో వచ్చి సెల్ ఫోన్ లాక్కొని దాడి చేశారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో వ్యతిరేకంగా వార్తాలు రాస్తావా అంటూ కొట్టారు. చంపాలనే ప్రయత్నం చేయగా వారి తప్పించుకున్నట్లు తెలిపారు. శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

నిర్మాణ పనులు నిలిపివేయాలి



ఆలయ భూమిలో బస్సు షెడ్ నిర్మిస్తున్న అధికారులు

ములుగు రూరల్ : ములుగు జిల్లా కేంద్రంలోని ఆలయ భూమిలో నిర్మిస్తున్న తాత్కాలిక బస్సు షెడ్ నిర్మాణ పనులను నిలిపివేయాలని శ్రీ హనుమాన్ ఆలయ భూపరిరక్షణ సమితి ఇన్‌చార్జ్ సుతారి సతీష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆలయ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ఈదమ్మగడ్డ శివారులో 409/ఏ, 409/ఏ/అ సర్వేనంబర్‌లో హనుమాన్ ఆలయానికి ఎకరం గుంట భూమి ఉందన్నారు. అప్పటి నుంచి ఆలయ భూమి అనుభవదారు కాలంలో ముడుంబ సుదర్శన్‌రావు పేరున కొనసాగుతుందని చెప్పారు. ఆలయ భూమిలో అధికారులు బస్ షెడ్ నిర్మించడం సరికాదని తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ములుగు రూరల్ : ప్రభుత్వ విద్యా విధానాన్ని ప్రతిఘటిస్తూ ఈనెల 27న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటి ఆధ్వర్యంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని గన్‌రెడ్డి ఆదిరెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని అన్నారు. కార్యక్రమంలో రాజ్ కుమార్, ఖలీల్, యాసిన్, వీరనారాయణ, రాజు, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి : పాఠశాలల్లో విద్యా వ్యవస్థను ధ్వంసం చేసే విధానాన్ని ప్రవేశపెట్టే ఆలోచనను విరమించుకోవాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగ నరేందర్‌కుమార్, మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు సమ్మయ్య, వెంకటలక్ష్మి, సునీత మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్పొరేటీకరణ, కేంద్రీకరణ, కాషాయికారణను ప్రోత్సహించే జాతీయ విద్య విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలన్నారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27వతేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేసేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఇసుక లారీలతో ఇబ్బందులు

● వీరభద్రవరం, టేకులబోరు వద్ద ట్రాఫిక్ జామ్



వీరభద్రవరంలో రోడ్డుపై నిలిచిన లారీలు

వెంకటాపురం(కె) : ఇసుక లారీలతో మండల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతి రోజు ఏదో ఓ చోట లారీలు నిలిచి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్న సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి భారీ సంఖ్యలో వెంకటాపురం మండలం మీదుగా హైదరాబాద్‌కు లారీలు వెళ్తన్నాయి. దీంతో మండల పరిధిలోకి పెద్ద సంఖ్యలో ఇసుక లారీలు వస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఇసుక లారీలు ఉండటంతో రోడ్డుపై వెళ్లే ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇసుక లారీలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'రైతులను మోసం చేసేందుకే సంబురాలు'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి : రైతులను మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబురాలు చేసుకోవడం సిగ్గుచేటుగా ఉందని మాజీ జెడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతుల పేరిట సంబురాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాదిరన్న తర్వాత రైతులకు ఏం చేశారో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగు విడతలుగా రైతు బంధుకు ఎగమానం పెట్టినందుకు రైతు సంబురాలు చేసుకోవడం సిగ్గు చేటున్నారు. రైతు కూలీలకు ఆత్మీయ భరోసా కింద రూ.12వేలు ఇస్తామని మోసం చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మాజీ సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన రైతు బంధు అంతర్జాతీయ స్థాయిలోనే కాకుండా దేశంలోని అనేక రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయన్నారు. రైతులను అన్ని రకాల మోసం చేసినందుకు గాను కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతు సంబురాలు చేసుకోవడం స్థానిక ఓట్ల కోసం రైతులను మభ్య పెట్టేందుకే అని అన్నారు. ఈ సమావేశంలో బీరెల్లి మాజీ సర్పంచ్ జాజ చంద్రం, మండల మాజీ అధ్యక్షుడు నూశెట్టి రమేష్, మహిళా మండల అధ్యక్షురాలు సోమ నాగమ్మ, నాయకులు తుమ్మ రాజేందర్, కొర్నబెల్లి శేషగిరి, దేవయ్య, దుర్గం నవీన్, దిలీప్ పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత



ములుగు రూరల్: అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ



గోవిందరావుపేట: అవగాహన కల్పిస్తున్న పస్రా సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్

● డీఎస్పీ రవీందర్

ములుగు రూరల్ : డ్రగ్స్ నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత అని డీఎస్పీ రవీందర్ సూచించారు. మంగళవారం మండలంలోని బండారుపల్లి మోడల్ పాఠశాలలో మత్తు పదార్థాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తుకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అన్నారు. మత్తు పదార్థాల అమ్మకాలు చేపట్టిన, అలవాటు పడ్డ వారి సమాచారం యాంటీ డ్రగ్ కమిటీలకు గాని, పాఠశాల ప్రిన్సిపాల్‌కు గాని పోలీసులకు అందిస్తే వివరాలు గోప్యంగా ఉంచుతామని, నగదు బహుమతి అందిస్తామని వివరించారు. విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. సీఐ సురేష్, ఎస్సై రామకృష్ణ, ప్రిన్సిపాల్ దేవకి, సిబ్బంది పాల్గొన్నారు.

గోవిందరావుపేట : ప్రతి విద్యార్థి యాంటీ డ్రగ్ సోల్జర్‌గా పని చేయాలని పస్రా సీఐ జి.రవీందర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చల్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యాంటీ నార్కొటిక్స్ వారోత్సవాల సందర్భంగా యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్ మాట్లాడుతూ. డ్రగ్ రహిత సమాజమే లక్ష్యంగా యువత పని చేయాలని, మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రజలు, యువత, విద్యార్థులు కలిసికట్టుగా ముందడుగు వేయాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో నంబర్ 87126 70086కి లేదా 1906కి లేదా డయల్-100కి లేదా సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని వివరించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐయామ్ యాంటీ డ్రగ్ సోల్జర్ అనే సెల్ఫీ పాయింట్ వద్ద పస్రా సీఐ, ఎస్సై, ఇతర అధికారులు ఫొటోలు దిగి 'సే నో టు డ్రగ్స్ ఎస్ టు లైఫ్' అంటూ నినాదాలు చేశారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

వెంకటాపురం(ఎం) : యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తమ బంగారు భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని వెంకటాపురం ఎస్సై చల్ల రాజు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులను యాంటీ డ్రగ్ సోల్జర్‌గా ఎన్‌రోల్‌మెంట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో పదిమందికి ఉద్యోగాలు



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ఏటూరునాగారం : తెలంగాణ స్కిల్స్ నాలెడ్జి సెంటర్ విభాగంలో శిక్షణ పొందిన మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ విద్యార్థులకు ఈ నెల 19వ తేదీన జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో పది మంది విద్యార్థులు ఉద్యోగాలు పొంది అపాయింట్‌మెంట్ లెటర్స్ తీసుకున్నారు. వారికి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రేణుక అభినందించారు. టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ ఫాతిమా, మెంటర్ రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జ్యోతి, భాస్కర్, సుమలత, జీవవేణి, అభిలాష తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఏటూరునాగారం: రైతు వేదికలో..



వెంకటాపురం(ఎం): క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



వెంకటాపురం(కె): బాణాసంచా కాల్చుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

జిల్లావ్యాప్తంగా రైతుల ఖాతాల్లో వానాకాలం సీజన్ రైతు భరోసా నిధులు జమ చేయడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తు మంగళవారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ర్యాలీలు నిర్వహించి బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. అలాగే ఆయా మండలాల రైతువేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా రైతులు వీక్షించారు. – సాక్షి నెట్‌వర్క్



ఎస్ఎస్‌తాడ్వాయి: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



మంగపేట: పాలాభిషేకం చేస్తున్న వెంకటేశ్వర్లు



వెంకటాపురం(కె): రైతు వేదికలో..



మంగపేటలో..

నోట్‌బుక్స్ అందజేత



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న విజయ్ రెడ్డి

గోవిందరావుపేట : మండలంలోని దుంపెల్లిగూడెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్‌లు, పెన్నులు, ఇతర సామగ్రిని బొబ్బ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పంపిణీ చేశారు. ఎంఈఓ గొంది దివాకర్ మాట్లాడుతూ బొబ్బ విజయ్ రెడ్డి గతంలో దుంపెల్లిగూడెంలో చదువుకున్నందుకు ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు నోటు బుక్స్‌లు ఉచితంగా పంపిణీ చేస్తున్నారని అందుకు వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. బొబ్బ మధుసూదన్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, భూక్య రాజు, సత్తిరెడ్డి, లక్ష్మా రెడ్డి, రాజు, బాబు, ముత్తయ్య, వెంకట్రామ్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.